

# అమ్మన్న సిస్టర్స్

**బాలి**

**ఆ రోజేదో పండుగ. కాసేపు కునుకుతీసి వీధిలోకి వచ్చాను. ఏమీ తోచకుండా ఉంది. శెలవులొస్తే చాలు. క్షణం తీరిక లేకుండా ఆటలూ, కబుర్లూ చెప్పుకొనే మా మిత్రబృందం ఇంకా ఎక్కడా కనపడ్డం లేదు. వీధిలోని స్థంభానికి చేరబడి, చొక్కాఎత్తి పొట్ట గోక్కుంటూ చుట్టూ చూస్తున్నాను. సరిగ్గా ఆ సమయంలో ఓ విషయం నా కళ్లబడింది. మా ఇంటికి ఎదురు ఇళ్లల్లో మూడో ఇల్లు అమ్మన్న సిస్టర్స్‌ది. సిమెంట్ గోడల మీద కట్టిన తాటాకు ఇల్లది. చాలా పెద్ద ఇల్లు. రెండు పెద్ద గదులు మధ్య నడవ అటు ఇటు వీధి కొట్లు. వెనక వంటగదికి ముందర పంచపాలీ – ఇక వీధి వేపు అందరూ కూచోడానికి పెద్దఅరుగు.**

రోడ్లని శుభ్రం చేసే రాములమ్మ కర్రకు కట్టిన చీపురును చంకలో ఇముడ్చుకొని వాళ్ల వాకిట్లో నిలబడి వుంది. పెద్దమ్మన్న విస్తరాకులో పండుగ పిండివంటలు రెండు బూరెలు, ఇంత పరమాన్నమూ తెచ్చి ''ఒడిచాపవే'' అంది.

రాములమ్మ నడుముకి కట్టిన చీరచెంగుని చేతుల్తో చాపి పట్టుకుంది. బాస్కెట్‌బాల్‌లో ప్రావీణ్యత లేని పెద్దమ్మన్న విసరుగా విస్తరిని దాని ఒడిలోకి విసిరింది. అయితే గురితప్పి ఒక బూరె నేల మీద పడింది. అన్నం దాని ముఖాన్న చిమ్మింది. మరో బూరె ఒడిలో పడినట్టుంది. ''అయ్యో తల్లీ! కిందపెట్టనేక పోయారా తీసుకొనే దాన్ని'' అంది రాములమ్మ.

''చూసుకోలేదే!'' అంటూ పెద్దమ్మన్న కులంతో వచ్చిన అహంకారాన్ని, వయస్సుతో వచ్చిన వంగిన నడుముతోనూ వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది. కింద పడ్డ బూరెను మట్టి దులిపి నోట్లో వేసుకొని – తిరిగి తన పనిలో .... వీధి ఊడ్చడంలో పడింది రాములమ్మ. కాదు కాదు మా వీధి ఆరోగ్య దేవత రాములమ్మ–

పెద్దమ్మన్న వయసు ఎనభై సంవత్సరాలకు దగ్గరగా ఉంటాయి. తెల్లగా ఎత్తయిన మనిషి కొంచెం నడుం వంగింది. వంటి మీద గోచీ పోసుకున్న కావి రంగు పంచె. చిన్నప్పుడే భర్త పోవడం వల్ల నెత్తిన గుండు, ఆపై ముసుగు – మా వీధి బాపన వీధని ఇట్టే తెలిసిపోతుంది. ఇంట్లో ఏ మాత్రం చెత్త ఉన్నా వీదరుగు పక్కనే రోడ్డుమీద పోస్తాం. పులి విస్తరాకులు, మిగిలిన కూరలు, పచ్చళ్ల పిసురులు ఇంగువ పోపు వాసన వేస్తూ – తరిగిన కూరగాయ ముక్కలూ, విరిగిన రాచ్చిప్పలూ... వాడి వదిలేసిన అరటిదొన్నెలూ అరటాకులూ దాన్లో ఎంగిలి మెతుకలు. ఇల్లు అలికిన గుడ్డలూ – చంటిగుంటల పీతిగుడ్డలూ అన్నీ అక్కడే – అదో పెద్ద డస్ట్‌బిన్.

ఉదయం పదకొండు అయితే చాలు. కొంపల్లో వంటలూ, మడులూ, భోజనాలే అయిపోతాయి. ఆ తరువాత కాసేపటికి వీదరుగుల మీదకు చేరి వీధి వీదంతా వినపడేట్టు అచ్చట్లూ, ముచ్చట్లూ సొల్లుక బుర్లు–

మరో అరగంటలో మా మిత్రబృందం కలుగులు విడిచిన ఎలకల్లా బయటపడ్డారు. కూచి వరప్రసాద్ అని పేరుంటే కూచీ అని షార్ట్‌గా మేం పిలిచే కూచి గాడూ, పెరుగన్నం తప్ప మరొకటి ఇష్టపడని ధధి గాడూ, శ్రీమన్నారాయణా – నేను మా అరుగుమీదకు చేరాం. ఇక ఒకటే కబుర్లు. చదువుతప్ప అన్ని విషయాలూ చర్చిస్తాం. దారాసింగ్, కింగ్‌కాంగ్‌ల గురించి అప్పటిలో పేపర్లలో వచ్చేది. ఇద్దరూ పహిల్వాన్‌లే పెద్దపెద్ద పట్టణాలలో వారికుస్తీ పోటీలు జరిగేవి. ఒకమారు వీడు ఓడిపోతే రెండవసారి మరొకడు ఓడిపోయేవాడు. వారిద్దరి మధ్య అవగాహన అటువంటిది. జనం మాత్రం పందేలు వేసుకొని కొట్టుకు చచ్చేవారు. కూచిగాడు పీలగా ఉన్న తన కండలు చూసుకొని దారాసింగ్‌లా ఎప్పుడవుతానో అని తెగ ఇదైపోయేవాడు.

ఇలాగే ఓమారు శ్రీమన్నారాయణగారి అరుగు మీద కచేరి కబుర్లు చెప్పుకుంటున్నాం – ఏది ఎలాగున్నా వీళ్లిద్దరూ మన భారతంలో భీముడికి సాటి రారన్న విషయం మీద తీర్మానించబోతున్నాం. ఇంతలో చిన్నమ్మన్న గారు అంటే పెద్దమ్మన్నగారి చెల్లెలు, ఈమెకీ అరవై సంవత్సరాలు పైనే ఉంటాయి. అయితే పెద్దమ్మ కంటే కాస్త పొట్టి – ఓ ఛాయతక్కువ, డ్రస్‌కోడ్ అదీ మామూలే, అయితే మనిషి కాస్త లావు.

''ఏం చేస్తున్నార్రా'' అంది.

''చూశారుగా కబుర్లు చెప్పుకుంటున్నాం'' అన్నాడు కూచి.

''ఏడిశారు గానీ – ఆ శివాలయానికి పోయి, ఎవరో అమ్మాయి హరి కథ చెబుతోందట – ఇవాళ ఉందో లేదో కనుక్కురండి – వింటున్నారా!'' అంది.

''వింటున్నాం! వింటున్నాం''–

''ఆ కబుర్లేవో దార్లో చెప్పుకొండి – పొండి'' అంది.

నలుగురం బయలుదేరాం.

చినమ్మన్నను మంచి చేసుకుంటే మంచిది. దానికి తేలు మంత్రం, చప్పి మంత్రం వచ్చు. కొత్త చీపురు పుల్లలతో మంత్రం వేస్తుంది – చప్పికయితే వాళ్ళు తెచ్చుకున్న నూనె.

గిన్నెకూ మంత్రం వేసి ఆ నూనెను మూడు పూటలా చప్పి వచ్చిన ప్రాంతంలో పుల్లకు దూది కట్టి దాన్ని, నూనెలో ముంచి ఆరారగా రాయమంటుంది. తగ్గిపోతుందట – తేలుకుట్టిన వాళ్ళు వస్తే దెబ్బతో బాధ తగ్గిపోయి నవ్వుతూ వెళతారు (ట) నేను చూడలేదు. కొంతమంది చూశారు – ఎలాగన్నా చిన్నమ్మన్నను కాకా పట్టి ఇవి నేర్చుకోవాలి.

''గ్రహణం రానివ్వండర్రా చెప్తాను. మామూలప్పుడు చెప్పకూడదు – అవి మంత్రాలు – ఆ ఘడియల్లో చెప్తేనే పట్టు ఉంటుంది'' అంది లోగడ–

ఈ దిక్కుమాలిన గ్రహణం ఎప్పుడొస్తుందో – ఎదురుచూస్తున్నాం – ఇది చెప్పిన పనల్లా చేస్తున్నాం.

''ఈపని వాళ్ళగుమ్మంలో తెగపడిదొర్లుతుంటాడు కదా! – సత్తింబాబు – వాడికి చెప్పొచ్చు కదా!'' దదిగాడు అనుమానం వ్యక్తం చేశాడు.

''ఒరేయ్ ఇలాంటివి సత్తింబాబుకి చెప్పటం కన్నా మనకి చెప్పడమే మంచిది. చినమ్మన్నను కాకా పట్టవచ్చు – ఈ మధ్యెప్పుడో గ్రహణం వస్తుందట – మంత్రాల గురించి అడగాలి'' శ్రీమన్నారాయణ అన్నాడు.

''ఎందుకూ ఇప్పుడట్నించి రాగానే అడుగుదాం'' అన్నాను నేను.

''భలే ఐడియా'' కూచిగాడు ఎగిరి గంతేశాడు. ఉరకలు పరుగులూ పెట్టి ఇవాళ హరికథ ఉన్నట్టు తెలుసుకొని చినమ్మన్నకు ఆ వార్త చేరేశాం. పనిలో పనిగా మాకు మంత్రాలు చెప్పే బాధ్యత గుర్తు చేశాం.

''మీ కెందుకర్రా! చిన్నగుంటలు'' అంటూనే ''సర్లేనేప్పుతాను. గ్రహణం రోజయితే మంత్రాలకు పట్టు ఉంటుంది – ఎందుకూ ఈనెల పద్నాలుగున సూర్యగ్రహణం ఉందట – చూదాం'' అంది.

మా ఆనందానికి లోటు లేదు.

చినమ్మన్న – పెద్దమ్మన్నల అసలు పేర్లేమిటో మా వీధిలో ఎవరికీ తెలీదు. ఎక్కడికన్నా వెళ్ళాలంటే ఇద్దరూ కలిసే వెళతారు. ఆ తాటాకు ఇల్లెంత పెద్దదో అంతకు మూడింతలు పెరడుంటుంది వెనకన – ఆదంతా పెద్ద అరటితోట – అలా అనే బదులు అరటి అరణ్యం అనడం మేలు – ఇంకా అందులో నాలుగో ఐదో కొబ్బరి చెట్లున్నాయి. మొత్తం అదంతా చీకటిగా ఉంటుంది. ఏ మధ్యాహ్నమో ఆకుల మధ్యనుండి కాస్త వెలుగుజారి పెరటి రూపురేఖలు తెలుస్తాయి. చుట్టూ ప్రహరీగోడ దాన్నిండా నాచు. పెరటి మెట్లకు దగ్గరగా నుయ్యి – దానిగోడ వాళ్ళ నడుం ఎత్తులోనే ఉంటుంది. గట్టిగా నాలుగు బారలు వేస్తే నీళ్ళు చేతిలోకి వస్తాయి. నూతి చప్టా అంతా చిన్న చిన్న గోతులమయం – చిత్తడి చిత్తడి. వారికి అలాకాక ఇంకోలా ఎలా ఉంటుంది నూయి చప్టా అన్న తరువాత అనే నిర్లక్ష్యం. పెచ్చులూడిపోయి పరాగ్గా నడిస్తే కాలుబెణికి కింద పడే ప్రమాదముంది. అయితే అమ్మన్నలిద్దరికీ కాళ్ళ దగ్గరే కళ్ళున్నాయి కాబట్టి ఇంతవరకూ ఏం జరగలేదు. ఈ అరణ్యంలోకి మగవాళ్ళెవరూ రారన్నా ధైర్యంతో అమ్మన్నలిద్దరూ మహామడి పాటిస్తూ గుడ్డ విప్పుకొని లేకపోతే మడిబట్ట పేరుతో చిన్నగుడ్డ ముక్క మొలకూ చుట్టుకొని వంట ఇంటికీ, నూతి గట్టుకు తిరుగుతుంటారు.

ఇదిగాక ఆ ఇంటి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం కూడా వాళ్ళదే. అదిప్పుడు అమ్మితే లక్షలొస్తాయి. దానికి చుట్టూ గోడ ఉంది. అటు ఇటు ఇళ్ళున్నాయి. దానికో తలుపు పెట్టి తాళం కప్ప పెట్టారు – ఇదికాక చింతనిప్పుల అగ్రహారంలో భూములున్నాయి. అగ్రహారం పక్కనున్న రెండు మూడు ఊళ్ళ పౌరోహిత్యం వీళ్ళదే – సరే ఎందుకూ మంచిదని కామేశ్వరి అనే అమ్మాయిని పెంచారు. ఆమె వరుసకి మేనకోడలవుతుంది. ఛామనఛాయ, అందకత్తేనని చెప్పాలి– ఆమె అంటే ఇద్దరికీ గారాబం. ఇటు పూచికపుల్లని అటు వేయనివ్వరు. ఎందుకూ మేం ఉన్నాంగా అంటూ గుర్తు చేస్తుంటారు. దాని వంటిమీద పాతిక తులాల బంగారమన్నా ఉంటుంది. ''జూ''లో ఆడ జంతువుకు తోడు ఒక మగ జంతువన్నా ఉండాలి. లేక, మగ జంతువుకి తోడు ఆడ జంతువున్నా ఉండాలన్న విశాల సత్యాన్ని గుర్తు పెట్టుకొని పనీ పాటాలేని – పెడితే ఇంత తిని చక్కగా వళ్ళ చేస్తూ, కామేశ్వరికి ముప్పుటలా కాపలా ఉండే పోతరాజు లాంటి వీరవెంకట సత్యనారాయణశాస్త్రి అనే వాడితో పెళ్ళి జరిపించారు అమ్మన్నలిద్దరూ. మేం ఇద్దరం మాకిద్దరూ అన్నట్టు ఇద్దరి పిల్లల్ని కన్నారు. అమ్మాయికి రెండు సంవత్సరాలుంటే అబ్బాయికి ఓ పది నెలలుంటాయి. ఈ గుంటల్తో భర్త భార్యలిద్దరికీ మంచి కాలక్షేపం. వాళ్ళ ముక్కులూ, మూతులూ తుడిచి గుండెల మీదకు ఎక్కించికొని, వాళ్ళ ఆటపాటలకు మురిసిపోయి వీధరుగు మీదపడి, పొర్లు దండాలుపెడుతూ ఉంటారు. వీళ్ళవలన గచ్చు అరిగిపోయి నున్నగా, నల్లగా మెరిసిపోతూ ఉంటుంది. పక్కలు నొప్పెడితే స్థంబాలకు చేరబడతారు. వీపు నొప్పిగా ఉంటే దొర్లడం ద్వారా ఆ నొప్పి తగ్గుతుంది. ఇదీ అదీ కాకపోతే దారంటపోయే ఏ పరిచయస్తులనైనా గుమ్మంలోకి తీరుబడిగా పిలిచి వాళ్ళ పురుళ్ళూ, పుణ్యాలూ, అడిగి ఇంకాస్త మాటలు పెంచి, టీవీల్లో మధ్య మధ్య ఎడ్వర్‌టైజ్‌మెంటుల్లా ఎంజాయ్ చేస్తారు. అలా టైంపాసవుతుంది మరి.

''భోజనాలకి లేవండి – కాఫీలకు లేవండి'' అనో అమ్మన్నల్లో ఎవరో ఒకరు పిలిస్తే పక్క సందులో దారి నుండి పెరట్లోకి వెళ్ళి అన్నీ ముగించుకొని, మళ్ళీ గుడిలో పొర్లు దండాల మొక్కులు తీర్చుకుంటున్నట్లు వీధి గుమ్మంలోకి చేరిపోతారిద్దరూ–

వీరవెంకట సత్యనారాయణ లేక సత్తింబాబు – ఇంకా సంక్షిప్తంగా చెప్పాలంటే 'సత్తిం' – అయితే సత్తిం కొన్ని విషయాల్లో అమ్మన్నలిద్దరికీ సాయం చేస్తుంటాడు. అదేమంటే పెరట్లో ఉన్న అరటి చెట్లు గెలలు కోయడం – పళ్ళ గెలలయితే గదిలో పెట్టి మగ్గపెట్టడం – అరటి పూలు జాగ్రత్తగా ఒలిచి కూరకు సిద్ధంగా చేసిన అమ్మన్నలకు అందించడం పులుసులు, కూరలు వేసుకుందుకు అరటి దొన్నెలు చీపురు పుల్లలు ఈనెలు తీసి కట్టడం, అరటి పూతలు ఒలిచి, ఒలిచి వాటిని చిన్న ముక్కలు తరిగి నారతీసి, ఏ కూరచేస్తే బాగుంటుందో వివరించడం – వీలయితే పులుసనీ, నువ్వు పిండి వేస్తే ఇంకా రుచిగా ఉంటుందని రికమండ్ చెయ్యడం,


# (KIP) KUTBI
# INDUSTRIAL PRODUCTS

**4-4-109, Lala Temple Street, Behind Vimal Plaza, Pan Bazar, Rani Gunj, Secunderabad-3.**

**Cell : 9440324598, Ph: 27712566**

**Dealers & Suppliers of Tralley wheel, Rubber & Hydralic Hose, MS & SS Pipe & Pipe Fittings 'V' Belt, Timing Belt**


**All Types of Bearing AND General Machinary Supplier**

భోజనాలకి వెతుక్కోకుండా అరటి ఆకులు సమయానికి సిద్ధం చెయ్యడం, పెరట్లో ఈ అరటి చెత్త పేరుకుపోతే ఆ చెత్తను, అరుగు వార రోడ్డు మీద వెయ్యడం, వాటిని తినడానికి ఆవులూ, గేదెలూ చేరితే, ఆవుల మీద ఓ కన్నేసి ఉంచి, అవి వేసిన పేడ, పోసిన ఉచ్చ అమృతంలా కుండల్లో పట్టి "అక్కయ్య గారూ, గోవు పంచకం అమృత సమానం, గోమయం సర్వశుద్ధి – రోగి నివారిణి" అని ఇరుగు పొరుగులకు పంచడం ఇది అతని దినచర్య. ఇది ప్రతి రెండు రోజులకూ జరుగుతుంది. దీని వలన ఇరుగు పొరుగులతోపాటు, మా వీధంతకూ తలలో నాలుకయ్యాడు. ఇలాంటివి ఏవి కావాలన్నా 'సత్తిం' చెవిన వేస్తే చాలు.

ఈ అరటి కూరలూ, పులుసులూ, వేపుళ్ళూ ఇవి కాకపోతే పెరట్లో దింపిన కొబ్బరికాయ పచ్చళ్లూ, కోరు జల్లిన వేపుళ్లూ తినితిని కామేశ్వరికీ విసుగ్గా ఉంటుంది. ఎలాగో చావనీ అని ఎన్నోసార్లు అనుకుంది.

అమ్మన్నలిద్దరికీ ఒకే ఒక్క గొప్ప కోరిక ఉంది – దయగల ఆ పరమేశ్వరుడు తమ ఆ చిన్న కోరికను నెరవేర్చకపోడు – తడులనీ, మడులనీ ఈ శరీరాల్ని, ఈ కోరికల్ని చిన్ననాటి నుండి ఎంత కాల్చలేదు? అదేమంటే పుణ్యకాశీలో చనిపోవడం – అంటే గంగ ఒడ్డున ఇంత బూడిదవ్వడం. అంటే ఈజీగా కైలాస ప్రాప్తి, పరమశివుని సన్నిధిలో స్థానం పొందడం – అలా ఈ అప్పచెల్లెళ్లిద్దరూ ఆరేడుసార్లన్నా కాశీ వెళ్లారు. ఇద్దరిలో ఎవరికి కాస్త నలతగా ఉన్నా, కాశీకి ప్రయాణం కడతారు. తూర్పు గోదావరి జిల్లా వాడా కరు, పేరు ముకుందం. అక్కడ సెటిల్ అయ్యాడు. ఇలా ఎప్పుడో దేశ యాత్రలో పరిచయమయ్యాడు. అన్ని వసతులతోనూ ఉన్న పెద్ద ఇల్లాయనిది – డబ్బు చెల్లిస్తే చాలు అన్ని పనులు చేసి పెడతాడు. వీళ్ళొస్తున్నట్టు ఓ ఉత్తరం ముక్క రాస్తే చాలు. ఆ ఉత్తరం సత్తిం రాస్తాడు. చాలా దీనాతిదీనంగా! ఈసారి మరణం ఇద్దరిలో ఎవరికో ఒకరికి ఖాయమని – ముకుందం స్టేషన్‌కి పరిగెత్తి వచ్చి వసతి గృహంలోకి చేరుస్తాడు. అయితే కాశీ పుణ్యక్షేత్రాన్ని చూడగానే – ఆ పవిత్ర గంగను, గంగ మీద నుండి వీచే చల్లగాలికి – ఇక ఇక్కడే ఛస్తామన్నా సంతోషంతో ఒళ్లు పులకరించగా – ఇంత బూడిదై ఆ పరమేశ్వరుడిలో లీనమైపోతున్న భ్రమ కనుల ముందు మెరుపులు మెరవగా, మణికర్ణికా ఘట్టంలో నిరంతర శవదహనాలతో అగ్ని కీలలు పై కెగసెస్తూ ఉంటే, అవి తమను ఆ పరమాత్మునిలో లీనం కమ్మని ఆహ్వానించే చేతుల్లా భ్రమసి, దీనికి తోడు ముకుందం గారి ముకుళించిన హస్తాలూ – ఇంకా ఏమన్నా కావాలా అప్పగారూ అని సవినయంగా తలలో నాలుకలా ఇద్దరి చుట్టూ తారాడుతోంటే, వెంట తెచ్చిన రోగం, నీరసం మటు మాయమయి, గంటల్లోనే ఆరోగ్యం కుదుట పడుతూ, మరో మూడు నెలల్లో రంగుదేలి, వంట్లో శక్తి పెరిగే "ముకుందం మాకింకా ఆ పరమేశ్వరుడి నుండి పిలుపు రాలేదు – ఆరోగ్యమూ కుదుటపడింది. ఇక ఇంటికి వెళతాం – టిక్కెట్లు తెచ్చిపెట్టు – మేం వస్తున్నట్టు సత్తింబాబుకు ఓ ఉత్తరం రాసి పడెయ్" అంటారు. ఇలా తిరిగి ఇంటి ముఖం పెట్టడం – ఇది ఎనిమిదోసారి! మళ్లా అరటి పొడులూ, దూట కూరలూ, వేపుళ్ళూ, కొబ్బరి పచ్చళ్లూ మొదలు అని అప్ప చెల్లెళ్లిద్దరూ రిక్షాలోంచి దిగుతోంటే కామేశ్వరి సణుక్కునేది. ఇక తను వంటింటి ఛాయలకు వెళ్లే హక్కు లేదు. మేం ఉన్నాంగా అంటారిద్దరూ –

ఆరోజు సూర్యగ్రహణం. ముందు రోజే చినమ్మన్న మమ్మల్ని పిలిచి చెప్పింది – "గ్రహణం పట్టు మొదలవ్వగానే మనం ఏటి దగ్గర స్నానాలకు ఉండాలి. మీకు తేలు మంత్రమూ, చప్పి మంత్రమూ చెప్తాను. విడుపు స్నానాలు ఇళ్లల్లో చెయ్యొచ్చు – మధ్యలో ఈ రెండు గంటలూ ఆ ఏటొడ్డున ఈదురు గాలిలో ఎవడేడుస్తాడు – "మేమందరం భుజాలు ఎగరేశాం. మా ఇళ్లల్లో పెద్దలకూ ఈ విషయం చేరేశాం. సంతోషించారు మా వీధిలోనే కాదు. పక్క వీధుల్లో ఎవరికి తేలుకుట్టినా, చప్పి వచ్చినా ఫరవాలేదు. మేం మంత్రాలు వేసి వాళ్లను నవ్వేట్టు చేస్తాం. అంటే మేం చిన్నసైజు డాక్టరులమన్న మాట. రేపే ఆ చినమ్మన్న మాకు మంత్రాలు చెప్పడం లాంటి సర్టిఫికేట్ ఇస్తుంది. దీంతో మా పేరు, మా పేటలో మారుమ్రోగిపోతుంది. ఓ కట్ట చీపురు పుల్లలు అటకమీద దొరుకుంటే చాలు – గ్రహణం రోజున స్నానం చేసిన ఈ మంత్రాలను మననం చేసుకుంటే ఇంకా మంచిది. భలే... భలే.. భగవంతుడా – మా పేటలోని వాళ్లందరికీ తేళ్ళు కుట్టాలి దేముడా! లేక చప్పిలాంటి రోగమన్నా రావాలి!!




ఈ ఆనందానికి ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఉదయం పది గంటలకు సూర్యగ్రహణం మొదలవుతోందీ అంటే ఎనిమిదింటికే అమ్మన్నల గుమ్మంలోకి మా మిత్ర బృందం చేరిపోయాం. వాళ్లను తొందరపెట్టాం – సర్వీస్ అయిపోయి పాతబళ్లల్లా ఉన్న అమ్మన్నలను ఏటొడ్డుకు తీసుకెళ్లాలంటే మాటలా? పైగా రైలు ట్రాకంబట నడక. కింద రాళ్లపోరు. అయితే అదే, శారదా నదికి దగ్గరి దారి.

మసిపూసిన గాజు పలకలో నుండి చూస్తే గుండ్రంగా ఉన్న సూర్యబింబంలో చిన్న ముక్క పోయినట్టే ఉంది. అంటే గ్రహణం పడుతోందన్న మాట. చినమ్మన్నకు చెప్పాం. పదండి. పదండి. అంది. చొక్కాలు విప్పి నీళ్లల్లోకి దిగాం. మరీ లోతు లేని చోట ఆగాం. ఎర్రగా వంద్రు నీరు. మూడు సార్లు మునకలు వేశాం. వళ్లంతా తడిసినట్టే – లేచి నిలుచుంటే చలిగాలికి వణుకొచ్చింది. అసంకల్పంగా చేతులూ చంకల్లోకి వెళ్లి పోయాయి. కూచిగాడు, దధి – శ్రీమన్నారాయణా, నేనూ అయితే మేం కాక మరో ఇద్దరమ్మాయిలు, మంత్రాలు నేర్చుకోడానికి మాలో చేరారు. గాయత్రి, యశోద చినమ్మన్న చుట్టూ మూగాం.

ఏ అక్షర దోషమున్నా, పఠించకపోయినా మంత్రం పని చెయ్యదట – అందుకే వీలయినంత దగ్గరగా అమ్మన్న ముఖంలో ముఖం పెట్టి అక్షరాలు పలుకుతున్నాం – ఏడు పదాలున్న తేలు మంత్రాన్నీ, మరో ఏడు పదాలున్న చప్పి మంత్రాన్ని దేవ రహస్యంలా అమ్మన్నగారు మా చెవిన వేశారు. మంత్రం ఎలా వేయాలో, తీసుకోవలసిన జాగ్రత్తలూ, మెళకువలూ శెలవిచ్చారు. మాకు ఆనందం వేసింది. చలికి వణికిపోతూ దవళ్లు కొట్టుకొంటూ ఉంటే ఒకరికొకరం అప్పచెప్పుకుంటూ – అమ్మన్నగారికి అప్పచెబుతూ సందేహాలు తీర్చుకుంటున్నాం – పెదమ్మన్న ఒడ్డున చిన్న రాతి పలక మీద కూచుని చెంబుతో నీళ్ళు నెత్తిన పోసుకుంటూ భుజాలు తడుపుకొంటూ కాకిస్నానం చేస్తోంది.

ఉండండి చినమ్మన్న గావుకేక వేసింది. ఏమయ్యిందో తెలీదు. బిక్కముఖం వేసి ఆమెవేపు చూస్తున్నాం. "నా వంటి మీద పంచెను తొక్కేసినట్టున్నారు. అసలు ముడి ఎలా వీడింది చెప్మా!" చేత్తో నీళ్లల్లో వంటిమీద తడుముకొని "అమ్మో – అమ్మో – వంటిమీద పంచెలేదు. దూరంగా జరగండి వెధవల్లారా! నా వంటి మీద పంచె లేదు" అంది కంగారుగా బిక్కచచ్చిపోయాం. దాని మీద పంచె వూడిపోయి కొట్టుకుపోయిందన్నమాట!–

"దూరంగా జరిగి వెనక్కి తిరక్కుండా మంత్రాలు మననం చేసుకొండి" అంది మేం అటు తిరిగాం కూచిగాడు నా ముందుకి వంగి "దాని వంటి మీద పంచె లేదట. ఇప్పుడెలారా?" అన్నాడు నవ్వుతూ.

"ఏదో ఒకటి అవుతుందిలే" అన్నాను నేను కాళ్ల కింద వెతికింది కాబోలు "ఒరేయ్ వెధవాయిలూ చుట్టూ రాళ్లు, దిబ్బలు ఉన్నాయ్, పంచె నీళ్ల మీద తేలుతూ ఉండొచ్చు చూడండి" అంది.

వేయి కళ్లతో చుట్టూ చూస్తున్నాం. ఉన్నట్టుండి అరిచింది "అదిగో అది పంచెలా ఉంది – ఆ దిబ్బ పక్క"

నీళ్లుపారుతున్న వేపు చూస్తే – మట్టిదిబ్బ పక్క గడ్డి పరకలకు చిక్కుకుని బుడగలా ఏదో ఉంది''

''అదే అదే!'' అన్నాడు శ్రీమన్నారాయణ.

అందరం అటే వెళ్లాం. అమ్మన్న పంచే అది. ఏటి బురదలో కావిరంగు పంచె–''

ఆ పంచె అందుకొని ''వెధవలూ! మీరు ఇటు రాకుండా ఒడ్డెక్కండి'' అంది అమ్మన్న.

ఎలాగో ఆ ప్రవాహంలోనే పంచెని ఒంటికి చుట్టుకొంటోంది.

''ఏమిటీ? ఆ గోల... మంత్రాలు వచ్చాయా? అంది పెద్దమ్మన్న–

''వచ్చాయి వచ్చాయని, అసలు విషయం చెబితే నోరెళ్ళబెట్టింది.

ఆ తరువాతెప్పుడో జరిగిందది–

పెద్దమ్మన్నగారికి మామూలుగా వంట్లో నీరసంగా ఉంది. వారం రోజులయినా తగ్గలేదు. తలనొప్పితో మొదలయి ఇంకా ఏవేవో బయట పడుతున్నాయి – అవి ఏమిటో ఎందుకో తెలియడం లేదు.

''అయితే ఏమిటి? ముకుందానికి ఉత్తరం రాయించమంటావా?'' అంది చినమ్మన్న.

''అలాగే తోస్తోంది – సత్తిం గాడికి చెప్పి ఉంచు'' అంది. నీరసంగా మంచం ఆ పక్కకి తిరిగి పడుకుంటూ.

ఆ రోజు ఉదయం నుండీ ఒక్కలా వర్షం పడి, సాయంకాలం ఆరింటికి కాస్త తెరిపిచ్చింది. కానీ ఆకాశం ఇంకా మేఘావృత్తంగానే ఉంది. దాంతో చీకట్లు తొరగానే కమ్ముకున్నాయి. భోజనాలు తొందరగానే ముగించి వీధి గుమ్మంలో హరికెన్ లాంతరు వెలుగులో కామేశ్వరీ, సత్తెంబాబులు ఎవరితోనే కబుర్లు చెబుతున్నాడు. మంచం మీద దుప్పటి పరుస్తున్న చిన్నమ్మన్నకు, పెద్దమ్మన్న అసహనంగా తన మంచం మీద దొర్లడం గమనించి అడిగింది.

''వంట్లో ఎలా ఉందే అప్పా!''

''బాగానే ఉంది గాని కడుపు కాస్త నొక్కుతున్నట్లుంది''

''అనుమానమెందుకూ! బహిర్భూమికి పద'' అంది

ఆ ఇంటికి కరెంట్ లేదు – అప్పటికి మా వూళ్లోనే సక్రమంగా కరెంట్ లేదు. పెరట్లలో దొడ్లు చూస్తే ఎక్కడో విసిరేసినట్లు ఆ మూల దూరంగా ఉండేవి.

దండెం మీదున్న పంచె ముక్కను నడుముకు చుట్టుకొని చెంబులో నీళ్లు ఒక చేతిలో, మరో చేతిలో లాంతరుపుచ్చుకొని పెరట్లోకి నడిచింది పెద్దమ్మన్న.

''జాగ్రత్త! కింద చూసుకో – బురద. నేనిక్కడ కూచుంటాలే!'' చిన్నమ్మన్న పెరటి అరుగు మీద మరో లాంతరు దగ్గర పెట్టుకొని వత్తి పెద్దది తీసి అటే చూస్తూ కూచుంది. పెరడంతా చీకటిగా మహారణ్యంలా ఉంది. అరటి చెట్లు ఆకుల నుండి టప్పుటప్పుమని నీళ్లోడుతున్నాయి. కింద నేలంతా రొచ్చు రొచ్చు బురదగా ఉంది. ఆ చెట్ల మధ్య నుండి సన్నని బాట. నీటి గుంటలో కాంతిపడి ప్రతిఫలిస్తోంది అప్పుడప్పుడు. అక్కడక్క ఏవేవో పురుగులు, వాటిని తినడానికి కప్ప పిల్లలూ గెంతుతూ.

చిత్తడి, చిత్తడి – పెద్దమ్మన్న ఆ మధ్యలో తప్పటడుగులు వేస్తూ చెట్లులోంచి మాయమవుతోంది క్రమేపీ – బాగా చివరి వరకూ దొడ్డి గుమ్మం దగ్గరకు అలా వెళ్లిందో లేదో 'అమ్మో' అన్న పెద్ద కేక వినపడి చేతిలోని నీళ్లో చెంబూ హరికెన్ లాంతరూ కింద పడ్డ శబ్దం వినిపించాయి. ఆ తరువాత ఏదో అస్పష్టమయిన మాటా వినపడింది.

''ఏమిటే! ఏమిటే అప్పా!! కింద పడ్డావా – ఏం జరిగిందంటూ'' చిన్నమ్మన్న ఎదురుగా ఉన్న లాంతరు పుచ్చుకొని గబగబ అడుగులు వేసింది. ఏముంది – బురదలో, ఆ రొచ్చులో పెదమ్మన్న పడి ఉంది. చెంబో పక్క. మరో పక్క లాంతరు – ''ఏవయ్యిందే – బురద చూసుకోవలసింది. జారి పడ్డావా'' దగ్గరగా లాంతరుపెట్టి ఆ కాంతిలో అడిగింది.

పెద్దమ్మన్నకి నోరు పెగలడం లేదు. ''కాదు కాదు'' అంటూ చేతులు ఊపుతూ ''దొంగోడు – దొంగోడు. కొట్టాడే – మెడ తడిమి కొట్టాడే –'' వాడు వెళ్లిన దారి చూపింది చేత్తో–

బీడి పొగవాసన వస్తోంది... దొంగాడే – ఎవడో వచ్చాడు – ఏనాడూ లేదు. ఈనాడు, ఇలా జరిగింది. చినమ్మన్నలో భయం తన్నుకు వచ్చింది. చెదిరిన పెద్దమ్మన్న పంచెను సర్ది రెండడుగులు ఇటు వేసి ''సత్తెమూ – ఒరేయ్ సత్తిమూ – కామేశ్వరీ ఒసేవ్ – తొందరగా రండి రండి – అంటూ గుండెలవిసిపోయేట్టు అరిచింది. కాని ఆ కేక భయంతో సన్నమైపోయింది. మరో రెండు కేకలకి సత్తిమూ – కామేశ్వరీ ''ఏమిటేమిటీ'' అంటూ వచ్చారు. ''అప్ప – అప్ప'' లోపలికి తీసుకు పదండి'' అంది ఎలాగో గొంతు పెగుల్చుకొని.

కాలుజారి కింద పడిందనే అనుకున్నారు – భార్యాభర్తలిద్దరూ.

గదిలోకి మంచం మీదకు పెదమ్మన్నను చేరవేసిం తరువాత దొంగాడి సంగతి చెప్పి ''అప్పను కొట్టాడట'' అంది తలుపులు మూస్తూ. అమ్మో అన్నారిద్దరూ.

మంచం మీది పెదమ్మన్న అచేతనమయిపోయింది. ఉలుకూ పలుకూ లేదు – మనిషి వణికిపోతోంది. గుండె నీరసంగా కొట్టుకొంటోంది. మంచి నీళ్లు కావాలా? తాగుతావా? అని చిన్నమ్మని ఒకటీ రెండుసార్లు పిలిచింది. అయినా ఏ స్పందనా లేదు.

ఓ పది రోజులు గడిచి ఉంటాయి.

కామేశ్వరి వీధి గుమ్మంలో స్థంబానికి చేరబడి వీధిలోకి చూస్తూ ఏదో ఆలోచనలో పడింది. సత్తెం పిల్లల్ని గుండెల మీది కెక్కించుకొని ఆడిస్తున్నాడు. రోడ్డు వేపు చూస్తున్న కామేశ్వరికి సోదమ్మె కనపడింది. ఆమె దగ్గరగా రాగానే ''సోదమ్మగారూ ఇది విన్నారా!'' అంటూ అరుగు దిగి వెళ్లింది.

ఏమిటీ? నేనీ వేళే ఊర్నుండి రావడం – పిల్ల దాని దగ్గరకు ఏలూరు వెళ్లాను''.

''అయితే మీకు తెలీదన్న మాట! పెద్దమ్మన్న గారు పోయారు''

''ఎప్పుడూ! కాశీ ఎప్పుడెళ్లింది''.

''కాశీకి ఎక్కడెళ్లింది. అంతా ఇక్కడే జరిగింది''

''రామ – రామ చేసుకున్న వాళ్లకు చేసుకున్నంత'' అంటారు దీన్నే''.

నేను మధ్యాహ్నం తీరిగ్గా వస్తాను. పని మీద వెళ్తున్నానని సోదెమ్మ వెళ్లి పోయింది.

తిరిగి అరుగెక్కబోతున్న కామేశ్వరికి – తడి పంచెతో పళ్లెంలో ఉంచిన పాల గ్లాసు, మరింకేవో పదార్థాలతో, చిన్నమ్మన్న ఎదురొచ్చి మెట్లు దిగింది.

కామేశ్వరి రోడ్డు వారనుంచి ఆమె వెళ్తున్న వేపే చూస్తోంది. స్కూలుకి పోతున్న నేనూ, శ్రీమన్నారాయణ ఆమెనే గమనిస్తూ వెనకగా వెళ్తున్నాం – మా వీధి చివర్లో ఉన్న కాలవ మదుం మీద నిల్చుని చినమ్మన్న కాలవలో పాలు పోసి, పళ్లెంలో ఉన్న పదార్థాలు, పూలు ఒంపి చేతులు జోడించి, కళ్లు ఒత్తుకుని వెనక్కితిరిగింది. బహుశా పెదమ్మన్నకు నివేదించిన పూజా ద్రవ్యాలయ్యాయి. అదే సమయంలో ఒడ్డున రోడ్డు మీదున్న రాములమ్మ చీపురుతో చెత్తను కాలవలోకి నెడుతోంది.

ఎంత చిత్రం! ఎంత గంగయినా పవిత్రాన్నీ, కశ్మలాన్ని తనలో ఎలా ఇముడ్చుకొంటోంది. ద్వైత అద్వైతాల మధ్య మిథ్యాబింబం. ఇదే కాబోలు మాకు ఇంతకన్నా మాటలు రాక నేనూ శ్రీమన్నారాయణా మా స్కూలు వేపు పరుగులు తీశాం!

*

బాలి

9849963082



## అసత్యాలు కావు..

సముద్రాన్ని చూసి కళ్ళు పెద్దవి చేయడం
ఆకాశాన్ని చూసి నోర్లెళ్లబెట్టడం
రెండూ గొప్ప ఎక్స్‌ప్రెషన్స్–
భార్యను చూసి మొహం మాడ్చుకోవడం
కొలీగ్‌ను చూసి పళ్లికిలించడం
ఇవి బేడ్ ఎమోషన్స్–
తనను మించి కనిపించాలనుకోవడం
కొత్త కొత్త వేషాలేయడం
హారిబుల్ మిజరీస్–
సమస్యలను సృష్టించుకోవడం
పరిష్కారాలకోసం తల్లకిందులవడం
ప్చ్..పూర్ ఇన్హిబిషన్స్–
కోర్కెల గుర్రాన్నెక్కి స్వారీ చెయ్యడం
అదుపు తప్పి అమాంతం బొందలో
పడిపోవడం
ముమ్మాటికీ నేకెడ్ ట్రూత్స్–

– యం.కె.సుగమ్ బాబు